ఆకాశవాణి : హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 29.07.2024 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ అక్రమాలను బట్టబయలు చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

2. 14 వందల కోట్ల రూపాయల జీఎస్ టి ఎగవేత కుంభకోణంలో పోలీసులు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్, మరో నలుగురిపై కేసు నమోదు చేశారు.

3. ప్రధాన మంత్రి పట్టణ ఆవాస యోజన కింద ఇప్పటి వరకు కోటి 18 లక్షల ఇళ్ళను మంజూరు చేసినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

4. శ్రీశైలం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో అధికారులు ఈ సాయంత్రం మూడు గేట్లు తెరిచి దిగువనున్న నాగార్జున్ సాగర్ కు నీరు వదులుతున్నారు.

**CM:**

గత ప్రభుత్వ అక్రమాలను, ప్రభుత్వ అండదండలతో దోచుకున్న ప్రజా ధనాన్ని వెలికితీసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక జుడిషియల్ కమిటీని ఏర్పాటు చేసిందని, విద్యుత్ ఒప్పందాలకు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన అక్రమాలపై దర్యాప్తుకు ఈ కమిటీని వేశామని చెప్పారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న విశ్రాంత న్యాయ మూర్తి ఎల్ నరసింహారెడ్డిని తొలంగించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వు మేరకు ఈ సాయంత్రాని కల్లా ఈ కమిటీ కొత్త చైర్మన్ ను ప్రకటిస్తామని చెప్పారు. శాసన సభలో ఈ రోజు డిమాండ్ లపై బిఆర్ ఎస్ సభ్యులు, మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి వాదనలకు ముఖ్యమంత్రి స్పందించారు. ఈ కమిటీ ముందు మాజీ ముఖ్య మంత్రి చంద్రశేఖర్ రావు ఒక్కసారి కూడా ఎందుకు హాజరు కాలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ పాలనలో వేలాది కోట్ల రూపాయల అవినీతి జరిగిందని బి ఆర్ ఎస్ బినామీలకు బి హెచ్ ఇ ఎల్ కాంట్రాక్టర్ల నుంచి సివిల్ వర్క్ వరకు అప్పగించి దోచుకున్నారని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు.

MSL

**CASE:**

1400 కోట్ల రూపాయల జిఎస్ టి ఎగవేత కుంభకోణానికి సంబంధించిన కేసులో హైదరాబాద్ పోలీసులు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్, మరో నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ అక్రమాలు కనపడకుండా ఉండేందుకు ఐఐటి హైదరాబాద్ రూపొందించన పన్ను శాఖ తనిఖీ పద్ధతికి మార్పులు చేస్తూ సోమేష్ కుమార్ ఉత్తర్వు చేసి సదరు మోసపూరిత కంపెనీలకు లబ్ధి చేకూర్చారని ఆయనపై ఆరోపణ కాగా, అదనపు వాణిజ్య శాఖ కమిషనర్ ఎస్ వి కాశీ విశ్వనాథ్ రావ్, హైదరాబాద్ రూరల్ డిప్యూటీ కమిషనర్ శివరామ్ ప్రసాద్, ఐఐటి హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్ బాబు, ఫ్లింటో టెక్నాలజీ సంస్థతో కలిసి సోమేష్ కుమార్ విశ్వాస ఘాతుకం, కుట్రకు పాల్పడ్డారని ఎఫ్ ఐ ఆర్ లో పేర్కొన్నారు. వాణిజ్య శాఖ జాయింట్ కమిషనర్ రవి కానూరు దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు అయింది.

SDP

**GOVT – HOUSES:**

ప్రధాన మంత్రి పట్టణ ఆవాస్ యోజన కింద కోటి 18 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాజ్య సభలో ఈ రోజు ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాదానం చెపుతూ కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహూ – మొత్తం కోటి 14 లక్షలకుపైగా ఇళ్ళ నిర్మాణం

ప్రారంభమైందని ఇప్పటి వరకు 85 లక్షల ఇళ్ళు పూర్తి అయ్యాయని చెప్పారు. దేశ వ్యాప్తంగా అర్హులైన పట్టణ లబ్ధిదారులకు పక్కా ఇళ్ళు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు 2015 నుంచి ఈ పథకం కింద తమ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కృషికి మద్దతు ఇస్తోందని చెప్పారు.

NSD

**NTPC-CM:**

రామగుండంలో ప్రతిపాదిత 24వందల మెగా వాట్ల విద్యుత్ కర్మాగారం నుంచి 85 శాతం విద్యుత్ సరఫరాకు ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ టి పిసి పంపిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం  క్షుణ్ణంగా అద్యయనం చేస్తోందని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. అసెంబ్లీలో ఒక చర్చలో ముఖ్య మంత్రి పాల్గొని మాట్లాడుతూ ఇతర ప్రాజెక్టుల నుంచి కమిషన్ల కు ఆశపడిన గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. ఎన్ టి పిసి ఇప్పటికే 16వందల మెగా వాట్ల సామర్థ్యాన్ని నెలకొల్పిందని రాష్ట్ర విభజన చట్టం నిబంధనల ప్రకారం, తెలంగాణలో 4వేల మెగా వాట్ల సామర్థ్యం కోసం మరో 24వందల మెగా వాట్ల అదనపు సామర్థ్యం స్థాపించడానికి అనుమతి కోరిందన్నారు. ఎన్ టి పిసి ప్రతిపాదనకు స్పందించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే.

DESK

**NEW GOVERNOR:**

రాష్ట్రానికి  ప్రస్తుతం ఇన్ చార్జ్   గవర్నర్ గా ఉన్న సీపీ రాధాకృష్ణన్ మహారాష్ట్ర గవర్నర్ గా నియమితులయ్యారు.  ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి  ఈ ఉదయం రాజ్  భవన్  కు వెళ్లి  గవర్నర్ రాధాకృష్ణ న్  ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్ర కొత్త గవర్నర్ గా నియమితులైన   జిష్ణుదేవ్  వర్మ ఈ నెల 31న రాజ్ భవన్ లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.  హైకోర్టు చీఫ్  జస్టిస్  అలోక్   అరాధే ఆయనతో ప్రమాణం చేయించనున్నారు.

PN

**CM WISHES TO OLYMPIC ATHELETS:**

పారిస్ ఒలింపిక్స్  లో  వివిధ  కేటగిరీల తొలి దశల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తోన్న తెలంగాణ అథ్లెట్స్ నిఖత్ జరీన్    శ్రీజ ఆకుల ....    పీవీ సింధు    లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి   ఫోన్ చేసి అభినందనలు తెలిపారు.    షూటర్  ఇషా సింగ్  కు   కూడా ముఖ్యమంత్రి    శుభాకాంక్షలు తెలిపారు.  వారంతా తర్వాతి దశల్లోనూ మంచి స్ఫూర్తిని కొనసాగించి విజయంతో దేశానికి    పతకాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

NSD/PTC

**TIGER DAY:**

ఈరోజు  అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని జరుపుకున్నారు.    పెద్ద  పులుల సహజ ఆవాసాలను రక్షించడానికి ప్రపంచ వ్యవస్థను ప్రోత్సహించడం   , పులుల సంరక్షణ గురించి అవగాహన   ,  మద్దతును పెంచడం  లక్ష్యంగా ఈరోజు ఈ

దినోత్సవం జరుపుకున్నారు . భారతదేశంలో పులుల సంఖ్య ప్రస్తుతం స్థిరంగా , పెరుగుతోందని ప్రపంచ వన్య ప్రాణుల నిధి వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ పేర్కొంది. మంచిర్యాల జిల్లా కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో, నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో ఈరోజు ప్రపంచ పులుల దినోత్సవాన్ని అటవీ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లాలో బైక్ ర్యాలీ నిర్వహించారు. డివిజినల్ అటవీ శాఖ అధికారి అప్పలకొండ జండా ఊపి ర్యాలీను ప్రారంభించారు. అమ్రాబాద్ పులుల సంరక్షణ కేంద్రం దేశంలోనే రెండవ అతి పెద్ద పులుల సంరక్షణ కేంద్రం కాగా తెలంగాణలో అతి ముఖ్యమైన స్థావరంగా ఉంది. ఇక్కడ 30 పెద్ద పులులు నివాసం ఉంటున్నాయి. జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ మాట్లాడుతూ 2018లో 7 పెద్ద పులులు ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య పెరిగిందన్నారు. అమ్రాబాద్ లో కూడా పెద్ద పులుల సంఖ్య పెరిగింది.

PTC NGKRNL

**శ్రీశైలం ప్రాజెక్ట్**

వరద ఉధృతి కారణంగా ఈ సాయంత్రం శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి 3 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. దీనితో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కు వరద ప్రవాహం పెరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు లోని 3 గేట్లను 10ఫీట్ల మేర తెరిచి 76వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల ద్వారా మరో 54, వేల 773 క్యూసెక్కుల నీటికి సమానమైన విద్యుత్ ఉత్పత్తి చేస్తూ ఆ నీటిని కూడా దిగువ కృష్ణా లోకి వదులు తుండటంతో సాగర్ లో నీటిమట్టం 513 అడుగులకు చేరింది. రేపు ఉదయానికి నాగార్జున సాగర్ కు వరద

ప్రవాహం మరింత పెరగనుందని అధికారులు భావిస్తున్నారు. సాగర్ లో నీటి నిల్వలు పెరుగుతుండటం తో బ్యాక్ వాటర్ వద్ద ప్రజలను అప్రమత్తం చేసారు..   జి రామకృష్ణ ,

పిటిసి, నల్గొండ

**భద్రాచలం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో   భద్రాచలం వద్ద ప్రస్తుతం  గోదావరి నది నీటిమట్టం 43.50  అడుగులకు తగ్గింది. ఎగువ నుంచి వరద తగ్గడంతో పాటు..   వర్షాలు పడకపోవడంతో గోదావరి ప్రవాహం క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈ రాత్రి కల్లా  43 అడుగులకు నీటి మట్టం పడిపోతే ఇప్పుడున్న మొదటి ప్రమాద హెచ్చరికను కూడా అధికారులు ఉపసంహరించనున్నారు.

PTC

**పెద్దపల్లి:**

పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 16   ,వేల  081 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, నంది పంప్ హౌస్ , హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై కు అదే స్థాయిలో నీటిని పంపిణీ చేస్తున్నామని, ఎల్లంపల్లి ప్రాజెక్టు లో స్థిరంగా 17.81 టీఎంసీల నీటి నిల్వ ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం లోని ఎల్లంపల్లి రిజర్వాయర్ ను జిల్లా కలెక్టర్ శ్రీహర్ష సందర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వస్తున్న వరద వివరాలు  , ఔట్ ఫ్లో , ప్రాజెక్టులో నీటి నిల్వ తదితర అంశాల ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

(పిటిసి)

**రాజన్న సిరిసిల్ల జిల్లా**

తెలుగు సాహిత్యం పై చెరగని ముద్ర వేసిన , రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం , హన్మాజిపేట గ్రామానికి చెందిన జ్ఞానపీఠ పురస్కార గ్రహీత , మాజీ రాజ్యసభ సభ్యులు, పద్మ విభూషణ్ డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారే ) జయంతి వేడుకలు ఈ రోజు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు..జిల్లాలోని సిరిసిల్ల వేములవాడ పట్టణాలతో పాటు , గ్రామాలలో సినారె జయంతి వేడుకలు నిర్వహించారు. సినారే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ptc

**రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా 84 శాతం సెల్ ఫోన్లు రికవరీ చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని , రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లాలో గత కొన్ని రోజుల గా పోగొట్టుకున్న , దొంగలించబడిన 78 ఫోన్లను రికవరీ చేసి సంబంధిత బాధితులకు ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 20- 2023 ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు జిల్లాలో 1200 సెల్ ఫోన్లు సిఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి 1019 ఫోన్లును బాధితులకు అప్పగించామని తెలిపారు.

(పిటిసి)